నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 22 డిసెంబర్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

# పేగుబంధం కోసం ప్రాణత్యాగం

- నీటమునుగుతున్న పిల్లలను కాపాడబోయి తల్లి మృతి
- నవాబ్‌పేట మండలం పోమాల్ చెరువులో ముగ్గురు మృతి


తల్లీబిడ్డలు మృతిచెందిన పోమాల పెద్ద చెరువు


మృతదేహాల వద్ద రోధిస్తున్న బంధువులు

నవాబ్‌పేట, డిసెంబర్ 21 : పేగు బంధం చావును కూడా లెక్కచేయదని ఓ తల్లి మృతిని చూస్తే ఇట్టే తెలిసి పోతుంది. ప్రమాదవశాత్తు చెరువులో పడిన తన పిల్లలను కాపాడేందుకు వెళ్లి తానూ మృత్యు ఒడిలోకి చేరుకున్న ఘటన నవాబ్‌పేట మండలం పోమాల్‌లో చోటు చేసుకున్నది. మహబూబ్‌నగర్ రూరల్ సీఐ గాంధీనాయక్, ఎస్సై విక్రమ్ కథనం ప్రకారం.. పోమాలకు చెందిన కుక్కింద సరోజ(28)కు నలుగురు సంతానం. వారిని తీసు కొని శనివారం ఉదయం పోమాల్ చెరువు వద్ద బట్టలు ఉతికేందుకు వెళ్లింది. చెరువు వద్ద సరోజ బట్టలు ఉతుకుతుండగా ఆమె కుమారుడు అక్షయ్‌కుమార్(5) ఈత కొడుతూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోతుండగా గమనించిన తల్లి కుమారుడిని కాపాడేందుకు నీటిలోకి దిగింది. ఆమె కూడా నీటిలో మునిగిపోతుండడంతో రెండో కూతురు దివ్య(6) కూడా నీటిలోకి దిగింది. ముగ్గురు నీటిలో మునిగిపోవడంతో పెద్ద కూతురు తేజశ్రీ సైతం వారి కోసం నీటిలోకి వెళ్తుండగా అటుగా వెళ్తున్న గ్రామస్తుడు గమనించి బయటకు తీసుకొచ్చాడు. చెరువులో మునిగిన వారి గురించి తేజశ్రీ గ్రామస్తులకు చెప్పడంతో బయటకు తీసి చూడగా, అప్పటికే తల్లీ, ఇద్దరు పిల్లలు మృతిచెందారు. చెరువు గట్టున ఉన్న చిన్న కుమారుడు శివతేజ, పెద్ద కూతురు తేజశ్రీ ప్రాణాలతో బయటపడ్డారు. మృతదేహాలను చూసి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల రోధనలు మిన్నంటాయి. గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ గాంధీనాయక్, ఎస్సై విక్రమ్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కాగా, ఇదే చెరువులో ఆరేండ్ల కిందట గ్రామానికి చెందిన మహిళ బట్టలు ఉతికేందుకు వెళ్లి తన ఇద్దరు పిల్లలను కాపాడబోయి మృతిచెందినట్లు తెలిపారు. సరోజ భర్త మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.



తిమ్మాజిపేట మండలం నేరళ్లపల్లిలో అంతిమయాత్రకు హాజరైన మర్రి కుటుంబీకులు, బంధువులు, నేతలు

# జంగిరెడ్డికి కన్నీటి వీడ్కోలు

- నేరళ్లపల్లిలో మర్రి జనార్దన్‌రెడ్డి తండ్రి అంత్యక్రియలు
- నివాళులర్పించిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ నాయకులు

తిమ్మాజిపేట, డిసెంబర్ 21 : నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తండ్రి మర్రి జంగిరెడ్డి అంతిమ యాత్ర కన్నీటి వీడ్కోలు మధ్య సాగింది. శుక్రవారం అర్ధరాత్రి హైదరాబాద్‌లోని మర్రి స్వగృహంలో ఆయన మృతి చెందగా.. స్వగ్రామం తిమ్మాజిపేట మండలంలోని నేరళ్లపల్లికి మృత దేహాన్ని తీసు కొచ్చారు. శనివారం పార్థివ దేహాన్ని బంధువులు, గ్రామస్తులు, బీఆర్‌ఎస్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. మధ్యాహ్నం అంత్య క్రియలు నిర్వహించారు. మర్రి వ్యవసాయ క్షేత్రంలో తండ్రి చితికి జనార్దన్‌రెడ్డి నిప్పంటించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గ్రామం లో విషాదచాయలు అలముకున్నాయి.

### ప్రముఖుల నివాళి

మర్రి జంగిరెడ్డి పార్థివ దేహాన్ని పలువురు సందర్శించారు. మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గువ్వల బాలరాజు, అంజయ్య యాదవ్, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు ఒంటేరు ప్రతాప్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, నాగం శశిధర్‌రెడ్డి, శివకుమార్, పార్టీశ్రేణులు, బంధువులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జంగిరెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మర్రిని, కుటుంబ సభ్యులను మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు ఓదార్చారు. ఎమ్మెల్సీ నవీన్ పాడె పట్టారు.


జంగిరెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు

# పనికిరావనే బయట పడేశారు

నమస్తే ఎఫెక్ట్

- మస్టర్ల ఘటనపై ఎంపీడీవో వివరణ

అమరచింత, డిసెంబర్ 21 : సమగ్ర వాటర్‌షెడ్ యాజమాన్య కార్యక్రమం (ఐడబ్ల్యూఎంపీ )లో చేపట్టిన పనులకు సంబంధించి అమరచింత మండలం అప్పంపల్లికి చెందిన కొలతల పుస్తకాలు 2015 సంవత్సరానికి చెందినవి కావడంతో పనికిరానందుకే ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది బయట పడేశారని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. 'మొక్కల పాలైన ఉపాధి హామీ మస్టర్లు' పేరిట శనివారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వచ్చిన కథనానికి ఎంపీడీవో స్పందించి మొక్కల మధ్యన వేసిన రికార్డులను తమ సిబ్బందితో కార్యాలయంలోకి తెప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీడీవో, ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయానికి సంబంధించిన రికార్డులు కావని, అప్పట్లో నర్వ మండలం, ఇతర మండలానికి సంబంధించిన వాటిని ఎందుకు భద్రపరచాలని బయటపడేసినట్లు తెలిపారు.

# సలీమాబేగం వివరాల సేకరణ

అమరచింత, డిసెంబర్ 21 : తప్పుల తడకగా ఆన్‌లైన్ నమోదు.. ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు నోచుకోని అర్హులంటూ శుక్రవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వచ్చిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ సిబ్బంది మహంకాళి ప్రభాకర్ శనివారం సలీమాబేగం ఇంటికి వెళ్లి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఓటర్ కార్డు వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత జనవరి నెలలో నిర్వహించిన ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటి కోసం సలీమాబేగం దరఖాస్తు చేసుకోగా, ఆన్‌లైన్ నమోదులో తన పేరుకు బదులుగా వై.లక్ష్మి పేరును ఎంట్రీ చేయడంతో సర్వేలో సలీమాబేగం పేరు రాలేదు. నలుగురు ఆడపిల్లలున్న తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని వేడుకున్నారు.

# కాంగ్రెస్ కార్యాలయంలో గన్నీ బ్యాగులు

- ఐకేపీ నిర్వాహకుల నిర్వాకం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు


పులికల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉన్న ప్రభుత్వ గన్నీ బ్యాగులు

అయిజ, డిసెంబర్ 21 : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు చేరాల్సిన గన్నీ బ్యాగులు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రత్యక్షమవుతున్నాయి. అయిజ మండలంలోని పులికల్ గ్రామంలోని ఐకేపీ కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గన్నీ బ్యాగులను కాంగ్రెస్ కార్యాలయంలోనే ఉంచుతున్నట్లు అధికారులకు తెలిసినా పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. అందరికీ అందుబాటులో ఉండేలా చూడాల్సిన మహిళా సమాఖ్య సభ్యులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### చర్యలు తీసుకుంటాం..

మండలంలోని పులికల్ ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో మహిళా సమాఖ్య సభ్యులు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గన్నీ బ్యాగులు ఉంచిన విషయం తెలుసుకుని పలుమార్లు హెచ్చరించాం. అయినప్పటికీ నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. రైతులందరికీ సకాలం లో గన్నీ బ్యాగులు అందించి ధాన్యం కొనుగోలు చేయాలని సూచించాం. సోమవారం కొనుగోలు కేంద్రంలోనే గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటాం.

– అన్నపూర్ణ ఏపీఎం, ఐకేపీ, అయిజ

# ప్రాణం తీసిన గట్టు పంచాయితీ

- ఇద్దరు రైతుల మధ్య వివాదం
- పోలీస్‌స్టేషన్‌కు చేరిన గొడవ
- మనస్తాపంతో మరో రైతు ఆత్మహత్య

అమరచింత, డిసెంబర్ 21 : ఇద్దరు రైతుల మధ్య పొలం గట్టు వివాదం ముదరడంతో మనస్తాపం చెందిన రైతు ఆత్మహత్యాయత్నం చేయగా.. చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన వనపర్తి జిల్లాలో చోటు చేసు కున్నది. మృతుడి కుటుంబీకుల కథనం మేరకు..

అమరచింత పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లో నివాసం ఉంటున్న గొల్ల చంద్రన్న, గొల్ల బాలస్వామి వ్యవసాయ పొలాలు పక్కపక్కనే ఉన్నాయి. అయితే నాలుగు రోజుల కిందట గట్టు విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కాగా తనపై బాలస్వామి కుటుంబ సభ్యులు దాడి చేశారని చంద్రన్న పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. అయితే భయంతో బాలస్వామి అదే రోజు ఇంట్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించి కుటుంబ సభ్యులు వెంటనే ఆత్మకూరు ప్రభుత్వ దవాఖానకు.. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు రెండు కుటుంబాలు ఒకే వీధిలో ఉండడంతో ముందస్తుగా చంద్రన్న అదుపులోకి తీసుకొన్నారు. మృతుడి కొడుకు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

# కానుకలు కనుమరుగేనా..!

గద్వాల జిల్లాలో 6 వేల కుటుంబాలకు కొత్త బట్టల్లేవు



- పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- ఇప్పటికే బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫాలకు మంగళం

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 21 : పండుగ అంటేనే ఒక సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం.. అందుకే కేసీఆర్ ప్రభుత్వం హిందువులకు బతుకమ్మ చీరలు, ముస్లింలకు రంజాన్ తోఫాలు, క్రిస్టియన్లకు క్రిస్మస్ గిఫ్ట్‌లను అందజేసింది. కానుకలు అందడంతో కొత్త బట్టలు ధరించి పేదలు పండుగలను ధూంధాంగా జరుపుకొనేవారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త బట్టల పంపిణీకి మంగళవారం పాడింది. దీంతో మళ్లా పండుగలకు దుర్భర పరిస్థితులు ఏర్పడ్డాయి. రేవంత సర్కారు ఏడాది పాలనలో ఒక్క పండుగకు కానుకలు అందించలేదు. మరో మూడు రోజుల్లో జరుపుకోనున్న క్రిస్మస్ పండుగకు సైతం గిఫ్ట్‌లు లేనట్లే.. ఇప్పటి వరకు గ్రామాలకు ఎలాంటి కానుకలు చేరలేదు.

### 6 వేల కుటుంబాలకు నిరాశే..

క్రైస్తవులకు పవిత్రమైన పండుగ క్రిస్మస్. అంతటి పెద్ద పండుగను పేద క్రిస్టియన్లు ఎంతో సంతోషంగా జరుపుకోవాలని నాటి కేసీఆర్ ప్రభుత్వం రెండు వారాల ముందే క్రిస్మస్ కిట్లను పంపిణీ చేసేది. జోగులాంబ గద్వాల జిల్లాలో అలంపూర్, గద్వాల నియోజకవర్గాల్లో మొత్తం 6 వేల కుటుంబాలకు క్రిస్మస్ గిఫ్ట్‌ల పంపిణీ జరిగేది. ఈ కిట్‌లో చీర, పంజాబీ డ్రెస్, ప్యాంట్, షర్ట్ ఉండేవి. కానీ ప్రస్తుత ప్రభుత్వంలో ఇప్పటి వరకు క్రిస్మస్ కానుకలు అందలేదు. గిఫ్ట్‌లకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేకపోవడంతో ఈ సారి కానుకలు లేనట్లే అంటూ పేదలు నిరాశ చెందుతున్నారు.

## క్రిస్మస్ గిఫ్ట్స్ ఇక లేనట్లే..

### అందని బతుకమ్మ చీర

సమైక్య రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన బతుకమ్మకు కేసీఆర్ సర్కారు పూర్వ వైభవం తీసుకొచ్చింది. దీంతో రాష్ట్ర ప్రజలు గౌరవించుకునేలా వేడుకలు నిర్వహించారు. మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన పండుగను దేశవిదేశాల్లో ఘనంగా జరుపుకొన్నారు. అంతటి పెద్ద పండుగను వైభవంగా నిర్వహించుకునేందుకు 18 ఏండ్లు నిండి రేషన్ కార్డులో పేరున్న ప్రతి ఆడబిడ్డకూ చీరలు పంపిణీ చేశారు. కొత్త బట్టలు ధరించి 9 రోజుల పాటు బతుకమ్మ వేడుకల్లో మహిళలు సంబురంగా పాల్గొనేవారు. కానీ కాంగ్రెస్ వచ్చాక పండుగకు ఆదరణ తగ్గింది. గద్వాల జిల్లాలో మొత్తం 1.60 లక్షల రేషన్ కార్డులు ఉండగా.. ఒక్కరికి కూడా బతుకమ్మ చీర అందలేదు. దీనికి తోడు సెక్రటేరియట్ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం చేతిలో బతుకమ్మను తొలగించడం.. అధికారికంగా నిర్వహించాల్సిన పండుగకు మంగళం పడటాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు.

### రంజాన్ తోఫా, ఇఫ్తార్ గాయబ్

ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ పండుగకు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తోఫాలు అందించడంతోపాటు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసేది. తోఫా కిట్‌లో సేమ్యాతోపాటు ఇంటి పెద్దలకు లాల్చీపైజామా, చీర, జాకెట్, పిల్లలకు పంజాబీ డ్రెస్ మేటీరియల్, ప్యాంట్, షర్ట్ ఉండేవి. అందుకే ఈ తోఫాలకు అపూర్వ ఆదరణ ఉండేది. జిల్లాలో మొత్తం 4 వేల ముస్లిం కుటుంబాలు కొత్త బట్టలు ధరించి ఎంతగానో మురిసిపోయేవి. కానీ ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం తోఫాల పంపిణీని పూర్తిగా నిలిపివేసింది.



కేసీఆర్ ప్రభుత్వంలో క్రిస్మస్ కానుకలు, బతుకమ్మ చీరలతో మురిసిపోతున్న మహిళలు(ఫైల్)

# పల్లీల కోసం వెళ్లి ప్రాణం మీదికి..

- వనపర్తిలో విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి
- తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆందోళన
- యాజమాన్యం నిర్లక్ష్యమే అంటూ ఆగ్రహం
- పాఠశాలలో వస్తువులు ధ్వంసం చేసిన నేతలు

వనపర్తి టౌన్, డిసెంబర్ 21 : పాఠశాల సమీపంలో ఉన్న పొలం బోరు వద్ద స్నానం చేసేందుకు వెళ్లిన విద్యార్థి పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన కరెంట్ వైర్‌కు ప్రమాదవశాత్తు తగిలి ప్రాణాలు కోల్పోయిన సంఘటన వనపర్తి జిల్లాలో చోటు చేసుకున్నది. బాలుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు..

చిన్నంబావి మండలం పెద్దమారూర్ గ్రామానికి చెందిన శిరీష, భాస్కర్‌రావు దంపతులకు కుమారులు హరీశ్‌రావు, గౌతమ్ వనపర్తి జిల్లా కేంద్రానికి సమీపంలో పెద్దగూడెం శివారులో ఉన్న రేడియంట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నారు. రోజు వారి మాదిరిగానే శనివారం తెల్లవారుజామున 5గంటల ప్రాంతంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు పాఠశాల సిబ్బంది నిద్ర లేపారు. ఆవరణలోనే స్నానాల కోసం వేడి నీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన స్థలం నుంచి సమీపంలోని వేరుశనగ పొలం వద్దకు తోటి విద్యార్థి లోకేశ్‌తో కలిసి హరీశ్ వెళ్లాడు. పల్లీలు తెంచుకొని తిరిగి వస్తున్న క్రమంలో పంట రక్షణ కోసం కరెంట్ షాక్‌తో రైతు ఏర్పాటు చేసిన కంచెకు హరీశ్ తగిలి కిందపడిపోయాడు. భయంతో తోటి విద్యార్థి పాఠశాలకు వెళ్లి వాచ్‌మెన్, సిబ్బందికి విషయం చెప్పడంతో వారు హుటాహుటిన వచ్చి జిల్లా కేంద్రంలోని దవాఖానకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందిస్తుండగా విద్యార్థి మృతి చెందాడు. ఈ విషయం తల్లిదండ్రులు తెలియజేయగా వారు వచ్చి మార్చురీలోని కొడుకు మృత దేహాన్ని చూసి కన్నీరు మున్నీరయ్యారు.


మృతదేహం వద్ద రోధిస్తున్న తల్లి

### విద్యార్థి సంఘాల ఆందోళన

యాజమాన్యం నిర్లక్ష్యంతో విద్యార్థి మృతి చెందాడని ఏబీవీపీ, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్, ఐద్వా మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల వద్ద ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. విద్యార్థి మృతికి కారణమైన యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలని, పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని పెద్ద ఎత్తున నినాదించారు. యాజమాన్యాన్ని అరెస్టు చేసే వరకు నిరసన విరమించేది లేదని భీష్మించుకూర్చున్నారు. ఎంతసేపటికి యాజమాన్యం స్పందించక పోవడంతో ఆగ్రహంతో పాఠశాలలోకి ప్రవేశించి అక్కడున్న వస్తువులను ధ్వంసం చేశారు. ఘటనా స్థలానికి వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్, సీఐ కృష్ణ, గోపాల్‌పేట్ ఎస్సై, ఎస్బీ ఎస్సై శివ చేరుకొన్నారు. చర్యలు తీసుకుంటామని పోలీసులు నచ్చజెప్పడంతో వారు శాంతించి ఆందోళన విరమించారు. తర్వాత డీఈవో, ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు తిరుమలేశ్, భరత్, ఆది, పవన్, రమేశ్, ఐద్వా సంఘం నేతలు పాల్గొన్నారు.


పాఠశాల గేటు ఎదుట నిరసన తెలియజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

# ఎన్నికల వాగ్దానం ఏమైంది?

- ఎమ్మెల్యే వంశీకృష్ణను ప్రశ్నించిన బల్మూరు రైతులు


బల్మూరులో ఆందోళన చేస్తున్న రైతులు

బల్మూర్, డిసెంబర్ 21 : 'కృష్ణా నీరు వద్దు.. భూములే ముద్దు.. ఉమామహేశ్వర ప్రాజెక్టు నిర్మాణం చేపట్టవద్దు' అని అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఏమైందని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణను రైతులు ప్రశ్నించారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయం ఎదుట వంద మంది రైతులు ఆందోళన చేపట్టారు. మాకు కృష్ణా నీరు వద్దు.. మా భూములే ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సాయుధ పోరాట సమితి నాయకుడు సీతారాం రెడ్డిమాట్లాడుతూ ఎన్నికలప్పుడు ప్రాజెక్టు నిర్మించకుండా చూస్తానని చెప్పిన ఎమ్మెల్యే నేడు రైతులను తొక్కుకుంటూ వెళ్లి ప్రాజెక్టు నిర్మిస్తానని అనడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎమ్మెల్యే రెడ్డి, దొరలకు పెత్తందారిగా వ్యవహరిస్తున్నారని, వారు చెప్పిందే అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వారు చెప్పినట్లు ఎమ్మెల్యే వ్యవహరించడం సరికాదన్నారు. ఈ ప్రాంతంలోని బడుగు, బలహీన వర్గాలను, రైతులను దృష్టిలో పెట్టుకొని ఉమామహేశ్వర రిజర్వాయర్ ప్రాజెక్టును నిలిపివేసి కేవలం కాల్వల ద్వారా నీరు అందేలా చూడాలని కోరారు. ఇందుకోసం అధికార పార్టీ నాయకులు స్థానిక ఎమ్మెల్యేపై.. ముఖ్యమంత్రిపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. నిర్మాణం నిలిపివేయకుంటే సీఎం రేవంత్‌ను కలవడానికి రైతన్నలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతులు గోవిందు, వెంకటయ్య, రాజేశ్, వెంకటేశ్, రఘుమా రెడ్డి శ్రీను తిరుతయ్య, మల్లయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాలను సాధించాలి

- సినీనటుడు ప్రదీప్‌కుమార్


మాట్లాడుతున్న సినీ నటుడు ప్రదీప్‌కుమార్

మిడ్జిల్, డిసెంబర్ 21 : విద్యార్థులు లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగాలని సినీ దర్శక, నిర్మాత ప్రదీప్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, అవసరమైన మేరకే టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని అందులో ఉన్నతంగా రాణించేలా కృషి చేయాలన్నారు. పరీక్షలంటే భయం వీడాలని డీఈవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. అంతకుముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో చేయూత వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, తాసీల్దార్ రాజు, ఎంపీడీవో గీతాంజలి, ఎంఈవో సుధాకర్, ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు, హెచ్‌ఎం సరస్వతి పాల్గొన్నారు.

### రూ.2.95 లక్షలు చోరీ

బాలానగర్, డిసెంబర్ 21 : హైదరాబాద్ నుంచి తిరుపూర్ వెళ్తున్న ప్రైవేట్ బస్సులో రూ.2.95 లక్షలు చోరీకి గురైనట్లు రాజాపూర్ ఎస్సై తెలిపారు. ఆయన కథనం మేరకు.. తమిళనాడులోని తిరుపూర్‌కు చెందిన వెంకటేశ్(51) 20 ఏండ్ల నుంచి బనియన్ల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. నెలకోసారి బనియనుల తీసుకుని ట్రాన్స్‌పోర్టులో వేసి హైదరాబాద్ వెళ్లి అక్కడ వివిధ దుకాణాలకు సరఫరా చేసి వారి నుంచి డబ్బులు వసూలు చేస్తుంటాడు. ఈ క్రమంలో ఈనెల 18న వెంకటేశ్ బనియన్లు తీసు కొని 19న హైదరాబాద్ చేరాడు.. అక్కడ వ్యాపారం ముగించుకొని వ్యాపారులు ఇచ్చిన రూ.2.95 లక్షలు తీసు కొని 20న రాత్రి హైదరాబాద్‌లోని లక్డీకపూల్ వద్ద ఆరెంజ్ ట్రావెల్ బస్సు ఎక్కాడు. మార్గమధ్యంలో రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ శివారులోని క్రితుంగ హోటల్ వద్ద రాత్రి 9:30 గంటల సమయంలో బస్సును నిలిపారు. ఆ సమయంలో డబ్బులు ఉన్న బ్యాగ్‌ను సీటుపై పెట్టి భోజనానికి వెళ్లి తిరిగి వచ్చి చూసే సరికి బ్యాగు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా లాభం లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

# 150 మందికి ఒకే నల్లా

- 20 నిమిషాల పాటు క్యూలైన్
- రాజోళి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులు

రాజోళి, డిసెంబర్ 21 : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 150 మంది విద్యార్థులకు నీళ్లు తాగేందుకు మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న ఒకే కుళాయి ఉంది. దీంతో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులకు నీళ్లు తాగేందుకు దాదాపు 20 నిమిషాల సమయం పడుతుంది. దీంతో విద్యార్థులు క్యూలోన్‌లో నిల్చొని నీళ్లు తాగాల్సిన దుస్థితి నెలకొన్నది. అధికారులకు సమస్య చెప్పినా ప్రయోజనం లేదని విద్యార్థులు వాపోతున్నారు. కాగా, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో కుళాయిలు ఏర్పాటు చేయగా, కొందరు విరగ్గొట్టి ఎత్తుకెళ్లినట్లు కాంట్రాక్టర్ చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


మిషన్ భగీరథ నల్లా వద్ద నీళ్ల కోసం క్యూలైన్‌లో నిల్చున్న విద్యార్థులు